సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

రాయపోల్: బాధిత కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

రాయపోల్, అక్టోబర్ 22 : సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్సీ, డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండలంలోని ఇందూప్రియాల్ గ్రామానికి చెందిన తిప్పతి మంగమ్మ కుటుంబానికి రూ.66 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆయన అందజేశారు. దౌల్తాబాద్ మండలం మాజీ ఎంపీటీసీలు బండారు దేవేందర్, వారమ్మ మల్లేశం, గజ్వేల్ 20వ వార్డు కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కొండపాకలో...

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 22 : కొండపాక మండల కేంద్రానికి చెందిన పలువురు అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందగా బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కొండపాక గ్రామశాఖ అధ్యక్షుడు సింగాటం రాము అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు మాజీ మంత్రి హరీశ్‌రావు, సహకరించిన అనంతుల ప్రశాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు యాదగిరి, నాగరాజు, నర్సింహచారి, శ్రీనివాస్, రేపాక స్వామి, రమేశ్, ఎల్లయ్య సుధాకర్ పాల్గొన్నారు.

చేర్యాలలో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయాలి

చేర్యాలలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల, అక్టోబర్ 22 : కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కేంద్రాన్ని చేర్యాలలో ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలో రైతులు పండించే పత్తిని కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ సమీర్ అహ్మద్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి వెంకట్ మావో మాట్లాడుతూ సీసీఐ కేంద్రం ఏర్పాటు కాకపోవడం వల్ల రైతులు తక్కువ ధరకు పత్తిని విక్రయించుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నదని, వెంటనే కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు.పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, నాయకులు ఆముదాల నర్సిరెడ్డి, ముస్త్యాల ప్రభాకర్, గొర్రె శ్రీనివాస్, రేపాక కుమార్, ఎండీ కరీం, గుండ్ర రవీందర్, పొన్నమైన సిద్ధులు, గర్నెపల్లి చంద్రం, బ్రహ్మయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 22: ధూళిమిట్ట మండల కేంద్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ధూళిమిట్టలో డి. మల్లయ్య అధ్యక్షతన సీపీఎం గ్రామ మహాసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధూళిమిట్ట మండలం ఏర్పడి నాలుగేండ్లు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ప్రభుత్వ కార్యాలయాలు లేక పాలనా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధూళిమిట్ట మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలన్నారు. అంతకుముందు మొదటి శాఖ కార్యదర్శిగా పోతురాజుల రాజేందర్, రెండో శాఖ కార్యదర్శిగా ముంగి ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు.సమావేశంలో నాయకులు చొప్పరి ప్రసాద్, సత్యనారాయణ, సిద్ధులు, మనీ, మహిపాల్, నర్సింహులు, కనకయ్య, బాలయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

కొమురవెల్లి, అక్టోబర్ 22 : అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గురువన్నపేటలో జరిగిన సీపీఎంశాఖ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు ఇస్తామని చెప్పి ఇంత వరకు ఏ ఒక్క రైతు ఖాతాలో డబ్బులు జమ చేయలేదన్నారు. రూ.2లక్షల పంటరుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయకుండా రేవంత్‌రెడ్డి సర్కార్ రైతులను మోసం చేసిందని విమర్శించారు. అనంతరం గ్రామ కార్యదర్శిగా తడకపల్లి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తాడూరి రవీందర్, తేలు ఇస్తారి, కృష్ణ, అన్నబోయిన ఐలయ్య, ఎలయ్య, చెర్ల భిక్షపతి, కనకయ్యగౌడ్, బరిగే రాములు, యాదగిరి, చంద్రం, కరుణాకర్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

భూంపల్లిలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), అక్టోబర్ 22 : అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని భూంపల్లిలో ఇటీవల పర్స నారాయణ అనే వ్యక్తి మృతి చెందాడు. మంగళవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవి, దుబ్బాక పీఏసీఎస్ చైర్మన్ కైలాశ్, బీఆర్ఎస్ భూంపల్లి గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకుడు సుక్క రాజు ఉన్నారు.

మిరుదొడ్డి ప్రాథమిక పాఠశాలలో పేరెంట్ క్యాలెండర్ ఆవిష్కరణ

మిరుదొడ్డి, అక్టోబర్ 22 : మిరుదొడ్డి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రూమ్ టూ రీడ్ సంస్థ ఆధ్వర్యంలో పేరెంట్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రూమ్ టూ రీడ్ సంస్థ సెక్టోరియల్ అధికారి భాస్కర్, టీచర్లు పద్మావతి, మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైక్లింగ్ పోటీల్లో రాణించిన బ్రదర్స్

సైక్లింగ్ పోటీల్లో రాణించిన అన్నదమ్ములను అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

హుస్నాబాద్‌టౌన్, అక్టోబర్ 22: ఈనెల 18,19వతేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ట్రాక్ సైక్లింగ్ పోటీల్లో హుస్నాబాద్‌కు చెందిన అన్నదమ్ములు ప్రతిభ కనబరిచినట్లు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జంగపల్లి వెంకటనర్సయ్య తెలిపారు. హుస్నాబాద్‌కు చెందిన సూరంపల్లి అమిత్ ఐదు కిలోమీటర్ల వ్యక్తిగత విభాగంలో పాల్గొని ప్రథమ స్థానం పొందగా, అండర్ 16 బాలుర విభాగంలో సూరంపల్లి సుమిత్ రజిత పతకం సాధించినట్లు ఆయన తెలిపారు. సైక్లింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన అన్నదమ్ములను సైక్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.మల్లారెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ రాష్ట్ర పరిశీలకుడు మనోహర్ మంగళవారం అభినందించారు.

మాజీ సర్పంచ్‌లకు పెండింగ్ బల్లులు విడుదల చేయాలి

సిద్దిపేట, అక్టోబర్ 22 : మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర జేఏసీ నాయకుడు యాదయ్యగౌడ్ అన్నారు. బిల్లుల విడుదల కోసం వచ్చే నెల 4న చేపట్టే చలో హైదరాబాద్ పోరుబాట గోడపత్రికను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంపక నాగయ్య, కోశాధికారి నవీన్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు శాతరాజుపల్లి ఆంజనేయులు, అజీజ్, కొమ్ము రాజయ్య, మద్దికుంట నవీన్, పల్లె నరేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనల వెల్లువ

విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ స్లీవ్‌రాజ్

జగదేవపూర్, అక్టోబర్22: క్రీడల్లో రాణించాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ స్లీవ్‌రాజ్ విద్యార్థులకు సూచించారు. జిల్లా స్థాయి ఎస్జీఎఫ్ క్రీడల్లో రాణించిన ఆదర్శ పాఠశాల విద్యార్థులను మంగళవారం పీడీ అనంతరాములుతో కలిసి ఆయన అభినందించడంతో పాటు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో పీడీ అనంతరాములుచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

చిన్నకోడూర్: అనంతసాగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గంగాపూర్ సొసైటీ చైర్మన్ మూలకాల కనకరాజు

మద్దూరు(ధూళిమిట్ట): గాగిళ్లాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి

చిన్నకోడూర్, అక్టోబర్ 22: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గంగాపూర్ సొసైటీ చైర్మన్ ములకల కనకరాజు అన్నారు. చిన్నకోడూరు మండలంలోని మల్లారం, సికింద్లాపూర్, అనంతసాగర్ గ్రామాల్లో గంగాపూర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం రైతులతో కలిసి ఆయన ప్రారంభించారు. సొసైటీ సీఈవో నాగరాజు, సిబ్బంది పరశురాములు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్22: కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర లభిస్తున్నదని చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి అన్నారు. మద్దూరు మండలంలోని రేబర్తి, గాగిళ్లాపూర్, బైరాన్‌పల్లి, బెక్కల్, కమలాయపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళారుల నుంచి రైతులను కాపాడి మద్దతు ధర అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేక మల్లేశం, పీఏసీఎస్ డైరెక్టర్లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

కొమ్మూరిని అడ్డుకున్న గ్రామస్తులు

కొమురవెల్లి, అక్టోబర్ 22 : మండలంలోని రసూలాబాద్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభంలో రసాభాస జరిగింది. మంగళవారం రసూలాబాద్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించేందుకు జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి రసూలాబాద్‌కు చేరుకున్నాడు. అదే సమయంలో అక్కడే మాజీ సర్పంచ్ పచ్చిమండ్ల స్వామిగౌడ్, రైతులతో కలిసి అక్కడికి చేరుకున్నాడు. మాజీ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామిగౌడ్, రైతులు మీరు ఏ హోదాలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నారని కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని ప్రశ్నించడంతో చాలా సేపు అక్కడ ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. కొమ్మూరి కొబ్బరికాయ కొట్టడంతో పాటు రసూలాబాద్ మాజీ సర్పంచ్ స్వామిగౌడ్‌తో రిబ్బన్ కట్ చేసి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం చేయించాడు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం

సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్లు, బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 22: రైతుల బాధలు తెలియని కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నదని ఏఎంసీ మాజీ చైర్మన్లు పాల సాయిరామ్, ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య మండిపడ్డారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు బీఆర్ఎస్ నాయకులతో కలిసి వారు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 417 కొనుగోలు కేంద్రాలకు కేవలం 80 మాత్రమే ప్రారంభించారని.. అందులో కూడా ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదన్నారు. ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల్లో సైతం ఇప్పటివరకు ఒక్క గింజకూడా కొనుగోలు చేయలేదన్నారు. మిల్లర్లకు ఇప్పటికీ కేటాయింపు జరగలేదని.. మూడు నెలలు గడిచినా ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు తయారు చేయలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొనుగోలు కేంద్రాలను ప్రాధాన్యతా అంశంగా తీసుకొని.. ముందస్తు సమీక్షలు నిర్వహించారన్నారు. ఇప్పటికీ మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని.. అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యం, మక్కలను ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు రైతులకు ధైర్యం, భరోసా కల్పిస్తామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రవీందర్‌రెడ్డి, ఆంజనేయులు, నవీన్, రాజు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని అధికారులపై చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి, డీపీవో దేవకీదేవి

నంగునూరు, అక్టోబర్ 22 : సమయపాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేకాధికారి, డీపీవో దేవకీదేవి హెచ్చరించారు. మండల కేంద్రంలో నిర్వహించిన మండల ప్రత్యేక సమావేశానికి పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు సమయానికి హాజరు కాకపోవడంపై ఎంపీడీవో, డీపీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి మండల సర్వసభ్య సమావేశం జరగనున్నది. మంగళవారం ప్రజాప్రతినిధులు లేక మండల ప్రత్యేకాధికారి, డీపీవో దేవకీదేవి అధ్యక్షతన మండల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు రాకపోవడంతో ఎంపీడీవో లక్ష్మప్ప ఫోన్ చేసి మరీ పిలిపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీడీవోతెలిపారు. తహసీల్దార్ సరిత, ఎంఈవో దేశిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కోల రమేశ్‌గౌడ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణాని రూ.11.49కోట్లు మంజూరు

హుస్నాబాద్‌టౌన్, అక్టోబర్ 22: హుస్నాబాద్ నియోజకవర్గంలోని పలు రహదారులు, వంతెనల నిర్మాణానికి రూ. 11.49 కోట్లు మంజూరైనట్లు బీసీ సంక్షేమం, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పంచాయతీరాజ్ సీఆర్ఆర్ గ్రాంట్స్ నుంచి వీటిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు ఆయన వివరించారు. నియోజకవర్గంలోని కోహెడ నుంచి తంగళపల్లి వయా కూరెళ్ల 1.10కిలోమీటర్ల బీటీరోడ్డునిర్మాణానికి రూ.1.10 కోట్లు, తంగళపల్లినుంచి శ్రీరాములపల్లి పీడబ్ల్యూరోడ్డు 1.60కిలోమీటర్ల బీటీరోడ్డు నిర్మాణానికి రూ. 1.50కోట్లు, హుస్నాబాద్ మండలం పందిల్ల స్టేజీ నుంచి పొట్లపల్లి సింగిల్ రోడ్డు 5.50కిలోమీటర్ల డబుల్‌రోడ్డు నిర్మాణానికి రూ. 3.95 కోట్లు, అక్కన్నపేట మండలం సంజీవయ్యకాలనీ వరకు 1.25 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.1.40 కోట్లు, అక్కన్నపేట మండలం చౌటపల్లి నుంచి మల్లంపల్లి రోడ్డు నిర్మాణానికి కోటి రూపాయలు, అక్కన్నపేట మండలం జెడ్పీ రోడ్డునుంచి పరికిబండ అరకిలోమీటర్ రోడ్డుకు రూ.60లక్షలు, హుస్నాబాద్ మండలం తోటపల్లి నుంచి పూసర్లపల్లి మధ్య వంతెన నిర్మాణానికి రూ. 1.49కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో రహదారులు, వంతెనల నిర్మాణానికి భారీగా నిధుల విడుదలకు కృషిచేసిన సీఎం రేవంతరెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్కకు మంత్రి పొన్నం ధన్యవాదాలు తెలిపారు.

కవి, రచయిత వహీదుద్దీన్‌కు సన్మానం

సిద్దిపేట టౌన్,అక్టోబర్ 22 : ఇదారే అదెబ్ ఇస్లామీ హిందూ తెలంగాణ ఆధ్వర్యంలో జరిగిన కవిత పోటీల్లో పరిపూర్ణ మానవుడు అంతిమ దైవ ప్రవక్త మహ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అనే అంశంపై సిద్దిపేట చెందిన ప్రముఖ కవి,రచయిత ఉపాధ్యాయుడు వహీదుద్దీన్ రాసిన కవిత ఉత్తమ కవితగా ఎంపికైంది.ఈ మేరకు హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ ఆడిటోరియంలో మంగళవారం ఆయనకు సన్మానం చేశారు.కార్యక్రమంలో అబూ నబిల్ సాహబ్, అబ్దుల్ రషీద్, ఆచార్య శివారెడ్డి,సీని రచయిత కృష్ణ,వెంకటస్వామి నాయుడు పాల్గొన్నారు.

సిద్దిపేట సీపీని కలిసిన పీపీ

సిద్దిపేట టౌన్, అక్టోబర్ 22 :సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధను సబ్ కోర్టు అడిషనల్ పీపీ నర్సయ్య మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా సీపీ అనురాధ మాట్లాడుతూ..ట్రయల్‌లో ఉన్న కేసుల్లో నేరస్తులకు శిక్షలు పడేలా సాక్షులను మోటివేట్ చేయాలని సూచించారు. కోర్టు విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శిక్షల శాతం పెంచాలన్నారు.

ముదిరాజులు కన్నెర్ర చేస్తే ప్రభుత్వం పతనం


మాట్లాడుతున్న ముదిరాజ్ హక్కుల సాధన సమితి నాయకులు

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 22 : ముదిరాజులు కన్నెర్ర చేస్తే ప్రభుత్వం ఉండదని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్, ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర యూత్ అధ్యక్షుడు ప్రశాంత్ అన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య, ఇతర ముదిరాజ్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కేసీఆర్ ప్రభుత్వంలో ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎదిగేందుకు ఎంతో సహకరించారని.. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తమ భవిష్యత్‌ను చిన్నాభిన్నం చేయాలని చూస్తున్నదన్నారు. వర్షాలు సమృద్ధిగా పడలేదని చెప్పి.. కేవలం 50 శాతం చేప పిల్లలను మాత్రమే పంపిణీ చేయడం దారుణమన్నారు. సమావేశంలో నాయకులు నవీన్, సుమన్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సతీశ్‌కుమార్‌పై విమర్శలను సహించం

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

హుస్నాబాద్‌టౌన్, అక్టోబర్ 22: మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌పై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తే సహించేదిలేదని బీఆర్ఎస్‌నాయకులు అన్నారు. హుస్నాబాద్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడారు. పదకొండు మాసాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీలేదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నియోజకవర్గంలో గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి తప్పా ఏమైనా జరిగిందా అని బీఆర్ఎస్‌నేతలు ప్రశ్నించారు. కొంతమంది మంత్రి పొన్నం ప్రభాకర్ మెప్పుకోసం బీఆర్ఎస్‌మాజీఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌పై విమర్శలు చేస్తున్నారని, ఇప్పటికైనా అలాంటి విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. మున్సిపల్‌చైర్‌పర్సన్ రజితావెంకన్న, వైస్‌చైర్‌పర్సన్ అనిత, బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, మార్కెట్‌కమిటీ మాజీచైర్మన్ తిరుపతిరెడ్డి, నాయకులు బొజ్జ హరీశ్, నమిలికొండ రాజయ్య, జెరిపోతుల సునీత, శ్రీనివాస్, జీవన్, రాజునాయక్ పాల్గొన్నారు.

అలంకార ప్రాయంగా కేంద్రాలు

కొనుగోలు కేంద్రాలు కేవలం అలంకార ప్రాయంగా మిగిలాయని బీఆర్ఎస్‌నాయకులు విమర్శించారు. హుస్నాబాద్ మార్కెట్‌యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదిరోజులు గడుస్తున్నా ఇప్పటివరకు కొనుగోళ్లు చేపట్టలేదని విమర్శించారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం తడుస్తున్నా పట్టించుకోకపోవడంతో రైతులు తప్పనిసరిగా రైస్‌మిల్లర్లకు అమ్ముకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు.

కరపత్రం ఆవిష్కరణ

కొమురవెల్లి, అక్టోబర్ 22 : మాలల మహాపాదయాత్రకు తరలిరావాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బుట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం కొమురవెల్లిలో మాల మహానాడు నాయకులతో కలిసి పాదయాత్ర కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే పాదయాత్రకు రాష్ట్ర నలుమూలల నుంచి మాలలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సిలువేరు సిద్ధప్ప, జిల్లా నాయకులు తలారి కిషన్, నాయకులు తుక్కోజి సతీశ్, సనాది కరుణాకర్, మద్దూరి కనకయ్య, మ్యాకల మల్లేశం, నవీన్, మనోజ్, కనకమల్లేశం పాల్గొన్నారు.

విద్యార్థులు మానసిక ఒత్తిళ్లకు దూరంగా ఉండాలి

హుస్నాబాద్‌టౌన్, అక్టోబర్ 22: విద్యార్థులు మానసిక ఒత్తిళ్లకు దూరంగా ఉండి విద్యనభ్యసించాలని హుస్నాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కందుల శోభాదేవి అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మానసిక ఒత్తిడిపై మంగళవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో విద్యనభ్యసించి, పట్టుదలతో ముందుకెళ్లాలన్నారు. పోటీపరీక్షల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించాలని సూచించారు.ఈఏపీసెట్, ఐఐటీ, నీట్‌కు కోచింగ్ ఇస్తామన్నారు. అధ్యాపకులు నిర్మలాదేవి, రవీందర్, సదానందం, లక్ష్మయ్య, సంపత్, కవిత, రాజేంద్రప్రసాద్, జి. కవిత, రాములు పాల్గొన్నారు.

హుస్నాబాద్ బుడగజంగాల కాలనీలో కార్డన్‌సెర్చ్

హుస్నాబాద్‌టౌన్, అక్టోబర్ 22: హుస్నాబాద్ పట్టణంలోని బుడగజంగాల కాలనీలో మంగళవారం సాయంత్రం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 17 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఏసీపీ సతీశ్ మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా కనిపించినా, నివాసం ఉంటున్నా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర సమయంలో పోలీసుల అవసరం ఉంటే తప్పకుండా 1930 లేదా, 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. సీఐ శ్రీను, ఎస్సైలు మహేశ్, అభిలాష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 22 : ఉపాధ్యాయ, ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తపస్ రాష్ట్ర కార్యదర్శి పబ్బతి శ్రీనాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్ష పోస్టర్‌ను తపస్ నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా.. ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. ఈ నెల 28న అన్ని మండలాల తహసీల్దార్లకు వినతి పత్రాలు ఇవ్వడం, నవంబర్ 5న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేయాలని నిర్ణయించామన్నారు. చివరగా నవంబర్ 23న రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్‌లో ఇందిరా పార్కు వద్ద ఉపాధ్యాయ ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించి పీఆర్సీ ప్రకటించాలి

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 22 : బకాయిలు చెల్లించి పీఆర్సీ ప్రకటించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షలో భాగంగా కొండపాక మండలంలో తపస్ మండలాధ్యక్షుడు బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నర్సిరెడ్డి, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

మర్కూక్,అక్టోబర్22: బైక్‌పై ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడి మృతిచెందిన సంఘటన మర్కూక్ మండలం అంగడికిష్టాపూర్‌లో చోటుచేసుకుంది. మర్కూక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..గ్రామానికి చెందిన అచ్చంగారి అశోక్ (37) సోమవారం ఉదయం జగదేవ్‌పూర్ మండలం రాయవరం గ్రామానికి పని నిమిత్తం వెళ్లి తిరిగి రాత్రి తొమ్మిది గంటల సమయంలో తిరుగుప్రయాణమయ్యాడు. గ్రామంలోకి రాగానే బైక్ అదుపు తప్పి కిందపడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. అశోక్‌ను గజ్వేల్ దవాఖానకు తరలించగా అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మంగళవారం పరిస్థితి విషమించి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 22 : కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ సిద్దిపేట సోషల్ మీడియా ఇన్‌చార్జి ఆకుబత్తిని రాము అన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమం, విద్య, వైద్యం, అభివృద్ధి ఆగిపోయాయని, ప్రజల గురించి, రాష్ట్రం గురించి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆలోచనే లేదన్నారు. రాష్ట్రాన్ని గాలికి వదిలేసి, హైదరాబాద్ నగరాన్ని ఆగమాగం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందన్నారు. ప్రజా సమస్యలపై, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం నిత్యం పోరాడుతామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ యువజన నాయకులు పాపిగారి నరేశ్, కొండిల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

29న దేవాదాయశాఖ కార్యాలయంలో టెండర్లు

చేర్యాల, అక్టోబర్ 22 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి సంబంధించిన పలు టెండర్లను ఈ నెల 29న దేవాదాయశాఖ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఏ.బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.స్వామివారికి భక్తులు మొక్కుల రూపంలో సమర్పించుకునే తలనీలాలు ప్రోగు చేసుకునే హక్కులు, ఎల్లమ్మ అమ్మవారి దేవాలయం వద్ద కొబ్బరికాయలు అమ్ముకునే లైసెన్స్ హక్కులకు వేలం సీల్ టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. జూలై 10 నుంచి అక్టోబర్ 31 వరకు దేవాలయంలోని కల్యాణ కట్ట వద్ద ప్రోగు చేసిన తలనీలాలు కిలో చొప్పున కొనుగోలు చేసేందుకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఆసక్తిగల వ్యాపారులు, సంస్థలు హాజరుకావాలని ఆయన కోరారు.

మట్టిరోడ్డు తొలిగింపు

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్22: మద్దూరు మండలం మర్మాముల గ్రామ శివారులోని సాయివెల్లి కుంట మధ్య నుంచి గతంలో వేసిన మట్టి రోడ్డును నీటి పారుదలశాఖ అధికారులు మంగళవారం తొలిగించారు. ఈ సందర్భంగా నీటిపారుదల ఏఈ సతీశ్ మాట్లాడుతూ 75 సర్వే నంబర్‌లోని సాయివెల్లి కుంట మధ్య నుంచి గతేడాది కొంతమంది అక్రమంగా మట్టిరోడ్డు వేసినట్లు పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ నేపథ్యంలో మద్దూరు రెవెన్యూ అధికారులు కుంట ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించి, హద్దులు పాతినట్లు తెలిపారు. హద్దుల ప్రకారం కుంట మధ్య ఉన్న మట్టి రోడ్డును జేసీబీ, డోజర్ సహాయంతో తొలిగించినట్లు తెలిపారు. చెరువు, కుంటలను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు తొలిగింపు సమయంలో ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఏఎస్సై విజయ్‌కుమార్ భద్రత చర్యలు తీసుకున్నారు.

ప్రయోగాత్మక విద్య విద్యార్థులకు మేలు

చేర్యాల, అక్టోబర్ 22 : ప్రయోగాత్మక విద్యా బోధన విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నదని హెచ్ఎం టి.కిషన్ అన్నారు. మండలంలోని ఎంపీపీఎస్ పోతిరెడ్డిపల్లి పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఉపాధ్యాయుడు కర్రోళ్ల విజయ్‌కుమార్ గాలికి అదోపీడనం, ఊర్థ్వ పీడనం, పార్శ్వ పీడనం ఉంటాయనే అంశాలను ప్రయోగాత్మకంగా నిరూపిస్తూ బోధించిన తీరు విద్యార్థులను ఆకట్టుకున్నది.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రయోగాల ద్వారా విద్యార్థులకు బోధన చేస్తే వారికి శాశ్వతంగా స్మృతిపథంలో ఉంటాయన్నారు. ప్రయోగాత్మకంగా బోధన చేస్తున్న విజయ్‌కుమార్‌ను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు డి.ఐలిరెడ్డి, ఈగ ఆంజనేయులు అభినందించారు.

విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

గజ్వేల్, అక్టోబర్ 22: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు ఆంగ్ల భాషా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణపతి రావు అన్నారు. మంగళవారం కళాశాలలో పోస్టర్ ప్రజంటేషన్ నిర్వహించగా ఇందులో కవుల గురించి విద్యార్థులు, అధ్యాపకులు తెలుసుకున్నారు. అధ్యాపకులు డాక్టర్ వెంకటేశ్, ఎం.భావనీ, ఎస్. మహేందర్, పద్మ, భావన పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 22 : సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు లభించింది. ఇందులో భాగంగా ఐఎస్‌వో బృందం కళాశాలను సందర్శించి వివిధ విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జీవన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కళాశాల వివిధ విభాగాల పురోగతిని పరిశీలించి.. ఐఎస్‌వో 21001, ఐఎస్‌వో 14001, ఐఎస్‌వో 50001 సర్టిఫికెట్లను ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్యామ్, అధ్యాపకులు శ్వేత, స్రవంతి, సువర్ణదేవి, కిశోర్, హరిప్రసాద్, స్వప్న హర్షం వ్యక్తం చేశారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 22: సిద్దిపేట పట్టణంలో అక్రమ కట్టడాలను మున్సిపల్ అధికారులు మంగళవారం కూల్చివేశారు. పట్టణంలోని 23వ వార్డు శివాజీనగర్‌లో రోడ్డు ఆక్రమణ చేసి ఐరన్ మెట్లు ఏర్పాటు చేయగా.. వాటిని కూల్చివేశారు. మురుగు కాల్వ అక్రమ నిర్మాణం, అదనపు ఫ్లోర్ యొక్క స్లాబ్ నిర్మాణాలు కూల్చివేసినట్లు టీపీవో దేవరాజు తెలిపారు. పట్టణంలో నూతన గృహ యజమానులు అనుమతులు తీసుకోవాలని.. తీసుకున్న అనుమతులకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని పట్టణ ప్రజలకు ఆయన సూచించారు.